**కథ**

**"ఏమండీ, అమెరికాకు వెళ్దామండీ" అడిగింది మా ఆవిడ.**

**"ఏం యిప్పుడేం దొబ్బిడాయి, బాగానే వున్నాం గదా!"**

**"ఆ వున్నాం, మీరేదో ఐ.ఐ.టిలో చదువు వెలగబెట్టి, అహమ్మదాబాదులో ఎం.బి.ఏ చేశారంటే అదెంత చదువోనని ముచ్చటపడి గర్వంగా చేసుకున్నాను మిమ్మల్ని. ఇప్పుడు మీరు చేస్తున్నదేంటీ, ఆ కంపెనీ స్నోలు, సబ్బులు, షాంపూలు అమ్మడమే గదా."**

# మా ఆవిడ

''ఆహా ఫరవాలేదే చదువంతగా లేకున్నా, నీ రూపం చూసి ముచ్చట పడి, ఏదో సర్దుకుపోదాంలే అని చేసుకున్నాను నిన్ను. ఇటువంటి తెలివి తేటలకేం తక్కువ లేదు. కంపెనీ వైస్ ప్రెసిడెంటును నేను. నీకు సబ్బులమ్ముకునేవాడిలా కనబడుతున్నానా, భేష్. ఇంతకీ ఆ అమెరికాలో ఏముందో చెప్పు, నువ్వు చెప్పకుంటే నాకేం తెలుస్తుంది''

''ఈ ఎకెసెక్కాలకేం గానీ మా చెల్లెలు, మరిది పైనెలలో అమెరికా వెళ్తున్నారట''

''అద్గదీ సంగతి. వాడికంటే ఇక్కడ వుద్యోగం సద్యోగం లేదు. ఏదో వాడి మేనమామ స్పాన్సర్ చేసి పిలిపించుకుంటున్నాడు. మనకేమయిందీ, జీతం కూడా హై ఫైవ్ ఫిగర్స్‌లో వుంది గదా. ఇక్కడి వసతులు అక్కడ చచ్చినారావు. కావాలంటే మీ చెల్లెలు వెళ్ళనీ, తరువాత మనం కూడా వెళ్ళి చూసొద్దాం ఓ రెండు నెలల పాటు.''


''సంబడమే. ఏం చూస్తారంట రెండు నెలల్లో. ఎంతో పెద్ద దేశమంట, ఎంత చూసినా ఇంకా చూడాల్సింది మిగిలే వుంటుందంట. ముష్టి మూన్నెళ్ళలో ఏం చూడగలం. ఎంచక్కా అక్కడే వుంటే మన హరి, సరిత కూడా చిన్నప్పటినుంచే అమెరికాలోనే చదువుకోవచ్చు''

''ఏం నేను ఇండియాలోనే బాగా చదువుకోలేదా''

''బడాయి. ఎంత ఐ.ఐ.టి ఐనా అమెరికా చదువవుతుందా. ఈ మాటలన్నీ ఎందుకుగానీ చక్కగా ఆ అమెరికాకు వెళ్ళే మార్గమేదో చూడండి''

ఇటువంటి సంభాషణలు, సన్నివేశాల ఫలితమే ఈ, మా అమెరికా జీవితం.

పెద్ద మల్టీ నేషనల్ కంపెనీ వైస్ ప్రెసిడెంటుగా, కంపెనీ వాళ్ళిచ్చిన పెద్ద బంగళా, డ్రైవరుతో సహా కారు, ఇంట్లో వంటమనిషి, పనిమనిషి, ఇంటిచుట్టూ వున్న తోట చూసుకోవడానికి ఒక తోటమాలి. జీవితం హాయిగా సాఫీగా సాగిపోతోంది. ఇవన్నీ వదిలి అమెరికాకు పోవటం నాకుససేమిరా యిష్టం లేకున్నా, ఇంట్లో ఇల్లాలిపోరు ఎంత పనైనా చేయిస్తుంది గదా.



నా క్వాలిఫికేషన్స్‌తో నాకు అమెరికాలో ఉద్యోగం సంపాదించడం అంత కష్టం కాలేదు. ఇప్పటికైనా మా ఆవిడ నా ఐ.ఐ.టీ విలువ గుర్తిస్తుందని ఎక్కడో ఒక మూల కొంచెం ఆశ. మా మరదలి భర్తమాత్రం, ఒకానొక అనామక కాలేజీలో ఎం.యస్. చేయడానికి సీటు సంపాదించుకున్నాడు.

**వి.రుక్మిణి**

మా అత్తగారికి చెప్పుకోవడానికి మాత్రం ఇద్దరల్లుళ్లు అమెరికాలోనే వుంటున్నారు.

అమెరికా వచ్చినప్పటినుంచి మా ఆవిడకు కూడా వుద్యోగం చేయాలని ఉబలాటం ఎక్కువైపోయింది. పెద్ద చదువుకున్నది కాదని ముందే చెప్పాను కదా. కానీ చూడముచ్చటగా వుంటుందేమో, మంచి డిపార్ట్‌మెంటు స్టోరులో కాస్మెటిక్స్ విభాగంలో సేల్స్ గర్ల్‌గా జాబ్ ఈజీగానే దొరికింది. ఒక ఎం.ఎన్.సీ. కంపెనీ వైస్ ప్రెసిడెంటు భార్య సేల్స్ గర్ల్ కింద చేరిందంటే నాకు మాత్రం 'కుంజర యూధంబు దోమ కుత్తుక చొచ్చెన్' అన్నట్టుగానే వుంది. నా పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు. ఇంటి విషయాలకొస్తే!

పొద్దున్నే లేచి, చచ్చీ చెడీ పిల్లల్ని రెడీ చేసి వాళ్ళకు టిఫిన్ బాక్సులు కట్టి, మేమూ తలో బాక్స్ తీసుకొని ఈసురోమంటూ బయలుదేరే వాళ్ళం ఎవరి పనులకు వాళ్ళు. వింటర్ అయితే మరీ బాధ. చలికి గజగజ వణుక్కుంటూ తల నుంచి కాలి వరకు పకడ్బందీగా ఉలన్ బట్టలు తొడుక్కుని యింటి ముందున్న స్నో అంతా తవ్వి పోసి (మా ఆవిడ ముందే చెప్పింది గదా స్నోలు పౌడర్‌లు అమ్ముకునే వాడినని) భయం భయంగా కారు దగ్గరికి వెళ్ళే వాడిని. అది స్టార్టు అవుతుందోలేదో అన్న భయం- ఎంతైనా సెకెండ్ హాండ్ కారు

కదా, పైగా ఈమధ్యలో డ్రైవింగ్ అలవాటే లేదు. ఇండియాలోనైతే ఇంట్లోంచి కాలు బయటపెడ్తగానే నిగ నిగ మెరిసే కారు డోరు తీసి పట్టుకుని 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ డ్రైవర్ రెడీగా వుండేవాడు. ఆఫీసు ముందు కారాపి మళ్ళీ డోర్ తెరిచి పట్టుకునే వాడు. ఇక్కడో, పిల్లల్ని స్కూలులో దింపి మా ఆవిడను వాళ్ళ స్టోర్ ముందు దింపి, ఎక్కడ పార్కింగ్ దొరికితే అక్కడ కారు పెట్టుకొని అక్కడినుండి ఆ చలిలో వణుక్కుంటూ ఫ్లైట్ రైట్ కొట్టుకుంటూ ఆఫీసు చేరడం. ఇండియాలో నేను ఆఫీసుకు రాగానే నా సెక్రటరీ చక్కటి చిక్కటి కాఫీ, చిరునవ్వుతో పాటు అందించేది. ఇక్కడయితే గబ గబా నా గదికి నాలుగు గదులు అవతలున్న రూమ్ చేరి అక్కడ మన కాఫీ మనమే కలుపుకోవడం, అక్కడ ఒక గిన్నెలో డికాక్షన్, మరొకదాంట్లో పాలు, పక్కనే పంచదార, షుగర్ ఫ్రీ పొట్లాలు వుంటాయి. ఎవరికి కావలసినట్లు వాళ్ళు కాఫీ కలుపుకోవడమే. అలవాటు లేని ప్రాణమేమో, ఒక రోజు పానకం, మరొక రోజు కషాయం తయారయ్యేవి. అష్ట కష్టాలు పడి వారం రోజుల్లో నాకు కావలసినట్లు కాఫీ కలుపుకోవడం నేర్చుకున్నాను. ఇవన్నీ ఎలావున్నా ఆఫీసు పని మొదలుపెడ్తే మాత్రం ఏం కష్టం అనిపించేది కాదు. ఇంతకన్నా ఎంతో కష్టమైన, క్లిష్టమైన పనులెన్నో చేసి వున్నాను గనుక ఇవేమీ కష్టమనిపించేవి కావు. ఇదీ ఒక పనేనా అన్పించిన సమయాలు లేకపోలేదు.

అసలు కష్టమంతా ఇంటికి చేరాలంటేనే. దోవలో మా ఆవిడను పికప్ చేసుకోవాలి. ఇంటికెళ్ళేసరికి పిల్లలిద్దరు అప్పుడే వచ్చేసి వుంటారు. వాళ్ళను స్విమ్మింగ్‌కో, బాస్కెట్ బాలుకో తీసుకెళ్ళాలి తీసుకురావాలి. ఉన్నది ఒక్కటే కారు. అదీ లోన్ తీసుకుని కొన్నదే. ఇప్పట్లో రెండో కారు ప్రసక్తే లేదు. నాకీ డ్రైవర్ పని నుంచి ముక్తీ లేదు. వాళ్ళను తీసుకుని యింటికి వచ్చేసరికి మా ఆవిడ రెండు సాంబారు క్యూబులు డీప్ ఫ్రిజ్‌లోంచి తీసి మైక్రోవేవ్ చేసిన సాంబారు, రైస్ కుక్కర్లో రైస్ పడేసి వుంచుతుంది. కూరలు గట్రా వుండవు. అవి ఆదివారం స్పెషల్సు. సైడ్ డిష్ కింద చిప్స్ వుండనే వున్నాయి గదా. ఆ భోజనం చూడగానే పిల్లలు ''ఛీ.. ఈ సాంబారు మాకొద్దు. రోజూ సాంబారేనా'' అంటూ అన్నం తినంగాక తినమని మొరాయిస్తారు.

''తింటే తినండి లేకుంటే లేదు. పొద్దున్నుంచి నిలబడి నిలబడి కాళ్ళు పీకేస్తున్నాయి. ఇక వండి వార్చే ఓపిక నాకు లేదు బాబూ'' అంటూ కాళ్ళు రెండూ సోఫాపైన పెట్టుకుని కూర్చునేది.

''డాడీ, నువ్వైనా చెప్పవా ప్లీజ్'' దిగులుగా నావైపు చూసేవారు. ఇండియాలోనైతే వంటావిడ పిల్లలు రాగానే వేడి వేడిగా దోసెలో, వడలో చేసేది. అయినా సమోసాలో మరేదో కావాలని పేచీ పెట్టేవాళ్ళు. వాళ్ళను చూస్తే జాలేసి నేనే ఏ పాస్తానో, చాకొలెట్ సాండ్ విచెసో చేసి పెట్టేవాడిని. ఇవన్నీ చేస్తూనే ఆ రోజు పోస్టు చూస్తే ఏముంది. అన్నీ కట్టవలసిన బిల్లులే. అప్పుడప్పుడూ మరో రకం తాఖీదులు. మీ యింటి ముందు లాన్ సరిగ్గా మైన్‌టైన్ చెయ్యడం లేదు. ఇట్లయితే మన ఏరియా ప్రాపర్టీ విలువలు పడిపోతాయి. కాబట్టి అగ్రిమెంటు ప్రకారం లాన్ మైన్‌టైన్ చేయమని నోటీసు. ఐ.ఐ.టీలో సీటువస్తే అంబరాన్ని చుంబించినంత సంతోషం. ఐ.ఐ.ఎమ్. అహమ్మదాబాదులో సీటు వస్తే, ఆకాశంలోని తారలలో మనమొక్కరం అన్న ఫీలింగ్. అనుకున్నట్టుగానే మంచి వుద్యోగం, ఈ రకమైన జీవితానికి మమ్మల్ని తయారుచేశారు కానీ, గడ్డి కొయ్యడానికి, వీధులు చిమ్మడానికి (స్నో ఎత్తిపొయ్యడమంటే అదే గదా) మమ్మల్ని తయారుచెయ్యలేదు గదా. ఈ గడ్డి కొయ్యడమేదో నేర్చుకోవలసిందే. తప్పదు. రోట్లో తలపెట్టి రోకలి పోటుకు భయపడితే ఎట్లా.

పిల్లలు ఏదో తిని పడుకున్నారు. ఇక కాస్త రెస్టు అనుకుంటూ సీ.ఎన్.ఎన్. 'ఆన్ చేసుకోబోతుంటే, మా ఆవిడవచ్చి ''మర్చిపోయారా ఈవారం వంటింటి డ్యూటీ మీది గదా, గిన్నెలు కడగాలి, వంటిల్లు వూడ్చి తుడవాలి, కుకింగ్ రేంజ్ శుభ్రం చెయ్యాలి'' అంటూ వరుసగా లిస్టు చదివింది. తాను మాత్రం ఎవరో ఫ్రెండు దగ్గర నుంచి తెచ్చుకున్న కభీ కుషీ కభీ గమ్- సీడీ చూడడానికి రెడీ అయిపోయింది. వంటింట్లోకెళ్ళగానే నాకు మా అమ్మే గుర్తుకొచ్చింది. మా అందరి భోజనాలు కాగానే అమ్మ వంటిల్లంతా సర్ది, వంట చేసే చోటును పేడతో అలికి ముగ్గుపెట్టి, కుంపటిలో బొగ్గులు వేసి పెట్టుకొని పక్కనే కాఫీ ఫిల్టర్, పాలగిన్నె రెడీగా పెట్టి వచ్చి పడుకునేది. ఇక్కడా కొంచెం మాడర్న్‌గా అయినా ఇంచుమించు అదే ప్రక్రియ. పేడ ప్లేసులో సబ్బు పొడులు వచ్చాయి. అదే తేడా, పనులు మాత్రం అవే గదా. ఉద్యోగం వచ్చిన తరువాత ఈ పనులన్నీ ఎట్లా జరుగుతున్నాయో గమనించలేదు. అసలు మా ఆవిడకైనా తెలుసా అని నా సందేహం.

''అయ్యో, అయ్యగారు వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తీసుకుంటున్నారు. ఏమైపోయారు మీరంతా'' అని ఒక్క కసురు కసిరే మా ఆవిడ, ఇక్కడ చిద్విలాసంగా సోఫాలో కూర్చుని, అయ్యగారూ, నీ అవస్థ నువ్వు పడు- అని నన్ను వంటింట్లోకి తరిమేసింది. ఇదంతా అమెరికా మహాత్యమే కదా. పాపం, కడుపులో చల్ల కదలకుండా కూర్చునే మా ఆవిడ మాత్రం ఇప్పుడు పొద్దున్న తొమ్మిది నుండి సాయంత్రం ఆరు వరకు ఆ స్టోరులో నిలబడే వుంటోంది గదా. పట్టె గొలుసుల ప్రతిబింబాలు కనిపించేలా నిగనిగలాడే ఆ పాదాలు ఇప్పుడు కళ తప్పి మొరటుగా తయారైనాయి. మహారాణీలా ఇల్లంతా తిరుగుతూ, ఏ చీకూ, చింతా లేకుండా వుండే మనిషి ఇప్పుడు పొద్దునే లేచి తయారవడానికి ఎంత హైరానా పడుతూ వుంటుందో చూస్తే, నాకే ఒక్కొక్కప్పుడు కళ్ళనీళ్ళు తిరుగుతాయి. ఎందుకొచ్చిన అమెరికా.

ఉన్నట్టుండి మా చిన్నారి సరితకు జబ్బు చేసింది. ఆఫీసులో డెడ్ లైన్లు. క్రిస్మస్ టైమేమో మా ఆవిడ కూడా యమబిజీ. కాస్మెటిక్సుకు హెవీ సేల్స్ టైమది. బేబీ సిట్టర్‌ను పెడితే ఒంట్లో బాగాలేని పిల్లను నేను చూసుకోలేననేసింది. సరిత సరే సరి. వాళ్ళమ్మను వదలకుండా పట్టుకుంది. ఇక లాభం లేదని ఆరోజు నుంచే ఉద్యోగం మానేసింది. నాకూ అట్లాగే అనిపించినా నేను మానేస్తే ఎట్లా. పాపను హాస్పిటల్లో చేర్పించాల్సి వచ్చింది. ఇంట్లో వారిని చూసుకునేదెవ్వరు. ఊరికి కొత్త కావటంతో తెలిసిన వాళ్ళెవరూ లేరు. అదే ఇండియా అయితే ఎంత బలగం, వంటావిడ, పనిమనిషి, ఆఫీసు స్టాఫ్, అంతగా అవసరం అయితే పరిగెత్తుకొని వచ్చే తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మ, మామ, మరెందరో. ఇక్కడ ఎవరున్నారని. పిన్ని వున్నా చాలా దూరం కాలిఫోర్నియాలో. తాముండేదేమో న్యూయార్కు.

పాప ఆరోగ్యం అంతంత మాత్రంగా వుండగానే ఇంటికి పంపించారు. మా ఇన్సూరెన్సు కవర్ చేసేది అంతవరకే. బాగా రెస్టు కావాలి పాపకు. రెండ్రోజులకొకసారి డ్యాక్టర్‌కు చూపించాల్సి వస్తోంది. తనేమో డ్రైవ్ చెయ్యలేదు. నాకు ఆఫీసు పనులతోపాటు హాస్పిటలు పనీ. ఇవన్నీ చూసి మా ఆవిడ ఒకింత చలించింది. అన్నీ సర్దుకున్నాక చూస్తే, బ్యాంకు బాలెన్సు అంతంతగానే వుంది. 'ఇద్దరం పని చేస్తున్నా ఇట్లా వుందేమిటి పరిస్థితి. అక్కడ మీ ఒక్కరి జీతంతో ఎంత దర్జాగా వుండేవాళ్ళం' అనేసింది పుటుక్కున. సంవత్సరం కావస్తున్నా అమెరికాలో ఏమీ చూసిందే లేదు. హాలిడేలంటే బాగా ఖర్చుతో కూడుకున్నపని. ఇవన్నీ చూసి ఏమనుకుందో ఏమో, ''మనం ఇండియాకు వెళ్ళిపోదామండీ'' అనింది ఒక అన్ గార్డెడ్ మూమెంటులో. ఆ మాట అనడం తరువాత నేను ఆ పనిలోనే పడ్డాను. ఎక్కువ ట్రబుల్ లేకుండానే మళ్ళీ ఒక ఎమ్.ఎన్.సీ కంపెనీలో మంచి వుద్యోగం వచ్చింది. ఐ.ఐ.టీ., ఐ.ఐ.ఎమ్‌లకు తోడు అమెరికన్ ఎక్స్‌పీరియన్స్ కూడా జత చేరింది కదా. మరింత మంచి జాబే వచ్చింది.

రోజులేమిటి సంవత్సరాలే గడిచాయి. హరి ఐ.ఐ.టీలోనూ, సరిత ఎమ్‌బీబీయస్ లోనూ చేరారు.

ఇద్దరు హాస్టల్స్‌లో వుండడంతో మేమిప్పుడు పూర్తిగా ఫ్రీ. మూడు నెలలు సెలవుపెట్టి యూరప్, అమెరికా అంతా చూపించాను మా ఆవిడకు.

తను మాత్రం మళ్ళీ అమెరికాలో వుండే మాటెత్తితే ఒట్టు.

✤